## బస్సుల కోసం తిప్పలు



వేములవాడ రూరల్, డిసెంబర్ 26 : రద్దీకి అనుగుణంగా బస్సులు లేక ప్రయాణికులు తిప్పలు పడుతున్నారు. గురువారం వేములవాడ పట్టణంలోని తిప్పాపూర్ బస్టాండ్‌లో రాజన్న భక్తులతోపాటు ఇతర ప్రయాణికులు గంటల కొద్దీ పడిగాపులు గాశారు. హైదరాబాద్, కరీంనగర్, వరంగల్, కామారెడ్డి వెళ్లేందుకు ఇబ్బంది పడ్డారు. వచ్చిన ఒకటి రెండు బస్సులు ఫుల్ కావడంతో మళ్లీ బస్సుల కోసం రెండు గంటల పాటు వేచి చూశారు. ఎదురుచూపుల తర్వాత వచ్చిన బస్సులో పరిమితికి మించి కిక్కిరిసి ప్రయాణించారు. వేములవాడకు రావాలన్నా.. పోవాలన్నా ఇబ్బందిగా ఉందని ప్రయాణికులు వాపోయారు.




# గురువుల గృహ'లీలలు'!

## అద్దె భత్యాల మినహాయింపునకు అడ్డదారులు?

- ఆదాయ పన్ను మినహాయింపు కోసం తప్పుడు పద్ధతులు
- అద్దె ఇంట్లో ఉంటున్నట్టు బోగస్ పత్రాలు
- లేని ఓనర్లు, ఇంటి నంబర్లతో రసీదులు
- నగరపాలక సంస్థ రికార్డులను పరిశీలిస్తే బయట పడుతున్న అసలు పేర్లు
- విద్యాశాఖ మొద్దునిద్ర పోతున్నదనే విమర్శలు
- అదే అదనుగా రెచ్చిపోతున్న ఉద్యోగ, ఉపాధ్యాయులు

**సమాజానికి ఆదర్శంగా నిలువాల్సిన గురువులు అడ్డదారులు తొక్కుతున్నారు. పన్ను మినహాయింపుల కోసం పక్కదారి పడుతున్నారు. తాజాగా ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ ద్వారా ఒకే అకౌంట్ నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు లోన్లు తీసుకున్న విషయం వెలుగులోకి రాగా.. ఈ వ్యవహారంలో తీగలాగితే డొంకంతా కదులుతున్నది. ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మినహాయిపు కోసం లేని ఇంటి నంబర్లను సృష్టిస్తున్నారు. అలాగే అద్దెకు ఉంటున్నట్టు, నెలనెలా కిరాయి చెల్లిస్తున్నట్టు రసీదులు తయారు చేస్తున్నారు. సంబంధం లేని పాన్ కార్డులను సమర్పిస్తున్నారు. ఒకరిద్దరు కాదు, వందలాది మంది గురువులు ఇదే బాటలో వెళ్తున్నట్టు ఆధారాలతో బయట పడుతుండగా.. అందుకు విద్యాశాఖ మొద్దునిద్రే కారణమన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కొంత మంది టీచర్లు తొక్కుతున్న అడ్డదారులు ఆ వ్యవస్థకే మచ్చ తెచ్చి పెడుతుండగా.. గురువులతోపాటు వివిధ విభాగాల్లో పనిచేసే కొంత మంది ఉద్యోగులు ఇదే దారుల్లో వెళ్తున్నారనే విమర్శలు వస్తున్నాయి.**

కరీంనగర్, డిసెంబర్ 26 (నమస్తేతెలంగాణ ప్రతినిధి) : నిజానికి చిన్నారులు తప్పు చేస్తే అది తప్పు అని చెప్పి, వారిని క్రమశిక్షణలో పెట్టి వారి భవిష్యత్‌కు బాటలు వేయాల్సిన గురువులే, ఆదాయ పన్ను మినహాయింపు కోసం అడ్డదారులు తొక్కుతున్నారు. ఎల్ఐసీ హౌసింగ్ ఫైనాన్స్ నుంచి ముగ్గురు ఉపాధ్యాయులు ఒకే లోన్ అకౌంట్‌పై రుణాలు తీసుకున్నట్టు.. అదే అకౌంట్‌కు వాయిదాలు చెల్లిస్తున్నట్టు బోగస్ రికార్డులు సృష్టించిన తీరును 'ఒకే అకౌంట్‌పై ముగ్గురు పంతుళ్లకు లోన్లు?' శీర్షికన ఈనెల 24న 'నమస్తే తెలంగాణ'లో కథనం ప్రచురించింది. ఈ బాగోతం విద్యాశాఖలో కలకలం సృష్టించింది. దీంతో ఈ వ్యవహారంపై ఆదాయ పన్ను శాఖ దృష్టి పెట్టినట్టు తెలుస్తున్నది. అంతేకాదు, సదరు అకౌంట్‌దారుల పూర్తి వివరాలతో కూడిన బోగస్ పత్రాలను సంబంధిత అధికారులకు సమర్పించినట్టు తెలిసింది. ఆ మేరకు సదరు ఆదాయపన్ను అధికారులు పూర్తి స్థాయి విచారణకు సిద్ధమవుతున్నట్టు అత్యంత విశ్వాసనీయ సమాచారం కాగా, ఈ విషయంలో తీగ లాగితే డొంకంతా కదులుతున్నది. ఐటీ మినహాయింపు కోసం కొంత మంది టీచర్ల వెళ్తున్న అడ్డదారి ఉపాధ్యాయ లోకానికి మచ్చ తెచ్చిపెడుతున్నది. నిబంధనల ప్రకారం.. ఉపాధ్యాయ, ఉద్యోగుల సౌకర్యార్థం బేసిక్ వేతనంపై ఇంటి అద్దె భత్యం ఉంటుంది. ఉదాహరణకు కరీంనగర్ ఉమ్మడి జిల్లాను తీసుకుంటే.. కరీంనగర్, రామగుండం నగర పాలక సంస్థ ప్రాంతాల్లో బేసిక్ వేతనంపై 17 శాతం ఇంటి అద్దె ప్రభుత్వం చెల్లిస్తున్నది. ఈ ప్రాంతాల పరిధిలో 8 కిలోమీటర్ల వరకు ఇదే భత్యం వర్తిస్తుంది. అలాగే సిరిసిల్ల, జగిత్యాల వంటి ప్రాంతాల్లో 13 శాతం, గ్రామీణ ప్రాంతాల్లో 11 శాతం, హైదరాబాద్ లాంటి ప్రాంతాల్లో 24 శాతం వరకు చెల్లింపులు ఉంటాయి. ఐటీ మినహాయింపులకు వచ్చే సరికి.. మూడు రకాలుగా లెక్కలు కట్టి, అందులో ఏదీ తక్కువగా ఉంటే ఆ మొత్తాన్ని ప్రభుత్వం పరిగణలోకి తీసుకుంటుంది. అయితే ప్రభుత్వం ఇచ్చే మినహాయింపు చేజారి పోకుండా ఉండడంతోపాటు ఆదాయ పన్ను మినహాయింపు కోసం పలువురు ఉపాధ్యాయులు పక్కదారుల్లో వెళ్తుండడం కనిస్తున్నది.

### బయట పడుతున్న అసలు పేర్లు

ఆదాయ పన్ను మినహాయింపుల కోసం పలువురు టీచర్లు సమర్పించిన రసీదులు, ఇంటినంబర్లు, పాన్‌కార్డులను పరిశీలిస్తే కళ్లుబైర్లు కమ్మే నిజాలు వెలుగుచూస్తున్నాయి. నిజానికి మెజార్టీ ఉపాధ్యాయులు, ఉద్యోగులు ఇదే దందాకు పాల్పడుతున్నట్టు ఆరోపణలున్నాయి. సొంతింట్లోనే ఉంటూ అద్దింట్లో ఉన్నట్టు చూపుతున్నారు. అందులోనూ ఏదో ఒక ఇంటి నంబర్ వేసి, సదరు యజమానికి నెలానెలా ఇంటి అద్దె చెల్లిస్తున్నట్టు బోగస్ రసీదులు సమర్పిస్తున్నారు. ఇటీవల తిమ్మాపూర్ మండలంలోని ఒక స్కూల్ కాంప్లెక్సులో జరిగిన డబ్బుల దుర్వినియోగం విషయంలో ప్రస్తుతం విచారణ జరుగుతున్నది. ఈ సందర్భంగా ఓ ఉన్నతాధికారి జరిపిన విచారణలో అనేక అక్రమాలు బహిర్గతమవుతున్నాయి. ప్రధానంగా మండలంలో పనిచేసే కొంత మంది టీచర్లు నిజాయితీగా పన్ను చెల్లింపులు చేస్తే.. మెజార్టీ ఉపాధ్యాయులు మాత్రం తప్పుడు అంటే పూర్తి బోగస్ పత్రాలు సమర్పించి పన్ను మినహాయింపు పొందుతున్నట్టు బయట పడుతున్నది. సదరు ఉపాధ్యాయులు అద్దింట్లో ఉంటున్నట్టు సమర్పించిన ఇంటినంబర్ల ఆధారంగా కార్పొరేషన్ రికార్డుల్లో తనిఖీ చేస్తే.. సమర్పించిన ప్రతి రికార్డు, ప్రతి పత్రం బోగస్ అని నిర్ధారణ అవుతున్నది. అసలు ఇంటి నంబర్లకు, యజమానుల పేర్లుకు ఏమాత్రం సంబంధం ఉండడం లేదు. మరో విచిత్రం ఏమిటంటే కొంత మంది పంతుళ్లు అసలు లేని ఇంటి నంబర్లను, ఓనర్లను సృష్టించి, వారికి అద్దె చెల్లిస్తున్నట్టు రసీదులను పన్ను మినహాయింపు కోసం సమర్పిస్తున్నారు. ఇంత జరుగుతున్నా విద్యాశాఖ మాత్రం మొద్దునిద్ర పోతున్నదన్న విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా ఏమైనా స్పందిస్తుందా.. లేదా చూడాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

### ఇవిగో ఆధారాలు

- ఇద్దరు ఎస్జీటీ ఉపాధ్యాయులు కరీంనగర్ కోతిరాంపూర్‌లో 8-6-110/1/జీ ఇంట్లో అద్దెకు ఉంటున్నట్టు చూపి, ఇంటి అద్దె భత్యం (హెచ్ఆర్ఏ) మినహాయింపును క్లెయిమ్ చేస్తూ సర్టిఫికెట్లు సమర్పించారు. అందులో ఒక ఉపాధ్యాయురాలు సమర్పించిన అద్దె రసీదు ప్రకారం ఇంటి యజమాని పేరు తాండవరం అమర్ కుమార్, మరో ఉపాధ్యాయుడు సమర్పించిన రసీదు ప్రకారం అదే ఇంటి యజమాని శ్రీమతి జాప భాగ్యమ్మ! అంతే కాదు, ఇద్దరు వేర్వేరు రకాల పాన్ కార్డులు సమర్పించారు. నిజానికి కార్పొరేషన్ రికార్డుల ప్రకారం చూస్తే ఇంటి యజమాని పేరు బీ రాజేశ్వరి, అలకాపురి అని ఉన్నది.
- మరో ఉపాధ్యాయుడు కరీంనగర్‌లోని కట్టరాంపూర్‌లోని ఇంటి నంబర్ 8-1-267లో నివసిస్తున్నట్టు చూపి, ఇంటి అద్దె రసీదును ఐటీ మినహాయింపు కోసం సమర్పించాడు. యజమాని పేరు బాలసంకుల అహల్యగా చూపాడు. ఇదే టీచర్ మరొక సందర్భంలో అతను కరీంనగర్ కట్టరాంపూర్‌లోని ఇంటినెంబర్ 10-1- 311/1లో నివసిస్తున్నట్టు చూపుతూ అద్దె రసీదును అధికారులకు సమర్పించాడు. వాస్తవానికి ఆయన చిగురుమామిడి మండలంలోని ఒక గ్రామంలో తన సొంతింట్లో ఉంటున్నాడు. నగరపాలక సంస్థ రికార్డుల ప్రకారం చూస్తే సదరు ఇంటి యజమానుల పేరు బసవేని మల్లమ్మ, ఆర్ హన్మంతరావుగా ఉన్నది. ఆదాయపు పన్ను మినహాయింపు కోసం బోగస్ పత్రాలను సమర్పించినట్టు స్పష్టమవుతున్నది.
- తిమ్మాపూర్ మండలంలో పనిచేసే భార్యాభర్తలు ఇద్దరూ ప్రభుత్వోపాధ్యాయులే. కరీంనగర్‌లోని భగత్‌నగర్‌లో సొంత ఇంట్లో నివాసం ఉంటున్నారు. కానీ, వారు హౌసింగ్‌బోర్డులోని ఇంటి నంబర్ 5-7-23 అద్దె ఇంట్లో నివసిస్తున్నట్టు చూపి ఐటీలో హెచ్ఆర్ఏ మినహాయింపుల కోసం నకిలీ ఇంటి అద్దె రసీదును సమర్పించారు. సదరు ఇంటి యజమాని పేరు తడిసిన శ్యామ్ సుందర్‌గా చూపించారు. కార్పొరేషన్ రికార్డుల ప్రకారం ఆ ఇంటి యజమాని పేరు శ్రీమతి సరోజ.
- మరో ఉపాధ్యాయుడు కరీంనగర్‌లోని తన సొంతింట్లోనే నివాసం ఉంటున్నాడు. కానీ, ఇంటినంబర్ 8-5-148/1లో ఉంటున్నట్టు చూపాడు. యజమాని పేరు దాసరి అనితగా పేర్కొన్నాడు. ఆమె పేరిట ఇంటి అద్దె రసీదును ఐటీ మినహాయింపు కోసం సమర్పించాడు. నిజానికి కార్పొరేషన్ రికార్డుల ప్రకారం చూస్తే సదరు ఇంటి యజమాని పేరు కనుకయ్యగా తేలింది.
- ఒక మహిళా టీచర్ సొంతింట్లోనే ఉంటారు. కానీ, కరీంనగర్ కట్టరాంపూర్‌లోని ఇంటినంబర్ 8-7-200లో అద్దెకు ఉంటున్నట్టు, ఆ ఇంటి యజమాని పేరు కంకణాల శ్రీనివాస్ రెడ్డి అని చూపారు. ఆ ఇంటి అద్దె రసీదును ఐటీ మినహాయింపు కోసం సమర్పించారు. విచిత్రం ఏమిటంటే మున్సిపల్ రికార్డుల ప్రకారం ఆ ఇంటి యజమాని పేరు మర్రి సుందరమ్మ. ఇంకో సందర్భంలో ఇదే టీచర్ కరీంనగర్‌లోని రాంనగర్‌లోని ఇంటినెంబర్ 9-8-134/1లో నివసిస్తున్నట్టు చూపి, యజమాని పేరు కుంట రమణ గా పేర్కొన్నారు. ఆయన పేరిట రసీదు పొంది, మినహాయింపు కోసం సమర్పించారు. మరో విశేషం ఏమిటంటే ఇదే ఇంటి నంబర్ ఉన్న ఇంట్లో మరో ఉపాధ్యాయుడు కూడా అద్దెకు ఉంటున్నట్టు రికార్డులు సమర్పించాడు. ఆ రసీదులో ఇంటి యజమాని పేరు తోడెంగ నాగరాజు అని ఉన్నది. కానీ నగర పాలక సంస్థ రికార్డుల ప్రకారం చూస్తే ఇద్దరు ఉపాధ్యాయులు చూపిన ఇంటి నంబర్‌తో ఎటువంటి ఇండ్లూ లేవు.

## రాజన్న ఆలయంలో కానుకలకు భద్రత ఏదీ!?

- ఆందోళన కలిగిస్తున్న హుండీలోని నగదు చోరీ
- అధికారుల పర్యవేక్షణ లోపమే కారణమనే విమర్శలు
- 2007లోనూ భద్రతా సిబ్బంది చేతివాటం
- అప్పుడు ఇద్దరు సస్పెన్షన్, ఒకరు బదిలీ



**దక్షిణకాశీగా ప్రసిద్ధిగాంచిన వేములవాడ రాజన్న ఆలయానికి రాష్ట్ర నలుమూలల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి తాకిడి ఉంటుంది. స్వామివారిని దర్శించుకున్న అనంతరం భక్తులు మొక్కులు చెల్లించుకునే ఆనవాయితీ ఉన్నది. అందులో భాగంగానే నగదు కానుకలను కూడా హుండీలో వేసి, మొక్కుకోవడం కనిపిస్తున్నది. ఈ హుండీ నగదు కానుకల ద్వారా స్వామివారికి ఏటా 34 కోట్ల రూపాయల వరకు ఆదాయం సమకూరుతుండగా, కానుకల భద్రతపై అనుమానాలు తలెత్తుతున్నాయి. నేరుగా హుండీలో నుంచి నగదు చోరీ చేయడం చూస్తే అధికారుల పర్యవేక్షణ లోపమే అందుకు కారణమనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.**



ఆలయంలో చోరీ జరిగిన హుండీకి తాళం వేసిన ఆలయ అధికారులు



అంతర్ ఆలయంలో కానుకలతో నిండిన హుండీలు

వేములవాడ, డిసెంబర్ 26: రాజన్న ఆలయంలో హుండీలను ప్రతి పది పదిహేను రోజులకోసారి లెక్కిస్తుంటారు. రద్దీ ఎక్కువ ఉన్న సందర్భాలను బట్టి నిర్ణయం తీసుకుంటారు. అయితే డిసెంబర్ 4న చివరిసారిగా హుండీలను లెక్కించారు. సుమారు 22 రోజులు కావస్తుండడం, అటు భక్తుల తాకిడి కూడా అధికంగా ఉండడంతో రాజన్న అంతర్ ఆలయంలో హుండీలు నగదుతో నిండిపోయాయి. అంతర్ ఆలయంలో మొత్తం నాలుగు పెద్ద హుండీలు ఉండగా, అందులో ఇప్పటికే మూడు ఫుల్ అయ్యాయి. అలాగే మరో నాలుగు చిన్న హుండీలు కూడా నిండిపోవడంతో వాటికి సీల్ వేసి పక్కకు పెట్టారు. ఆలయంలో చోటు చేసుకున్న పరిణామాల నేపథ్యంలో లెక్కింపు ఆలస్యమైనట్టు తెలుస్తుండగా, ఇదే అదునుగా సిరిసిల్ల ప్రాంతానికి చెందిన ముగ్గురు బాలురు వారం పది రోజులుగా హుండీలోని నగదును కొట్టేసినట్టు వెలుగులోకి వస్తున్నది. ఇప్పటికే రెండు దఫాలుగా నగదును కొట్టేసి, మూడోసారి బుధవారం అంతర ఆలయంలోని హుండీ నుంచి నగదు తీస్తూ చిక్కారు. అయితే చోరీకి పాల్పడింది మైనర్లు కావడంతో పోలీసులు కేసు నమోదు చేసి, కరీంనగర్‌లోని బాలసంరక్షణ కేంద్రానికి పంపారు. చోరీకి గుర్నైన హుండీని సైతం అధికారులు బుధవారం నాడు రాత్రి మూసివేసినట్టు తెలిసింది.

### భద్రతపై అనుమానాలు

రాజన్న ఆలయంలో భద్రతా సిబ్బందే హుండీలకు కన్నం వేసిన సంఘటన 2007లోనే జరిగింది. అప్పుడు సాక్షాత్తూ ధ్వజస్తంభం వద్ద హుండీలు వంచి, నగదు తీస్తున్న వీడియోలను గుర్తు తెలియని వ్యక్తులు బహిర్గతం చేయడం రాష్ట్ర దేవాదాయ శాఖను కుదిపేసింది. ఆనాడు ఇద్దరు ఎస్పీఎఫ్ సిబ్బంది సస్పెన్షన్ కాగా, మరొకరిపై బదిలీ వేటు పడింది. తాజాగా రాజన్న ఆలయంలోని అంతర్ ఆలయంలో హుండీల నుంచి మైనర్లు నగదు చోరీ చేయడం అనుమానాలకు తావిస్తున్నది. ఆలయంలో 11 మంది ఎస్పీఎఫ్ భద్రత సిబ్బంది, మరో 25 మంది హోంగార్డులు విధులు నిర్వర్తిస్తున్నా చోరీ జరగడం చూస్తే 'భద్రత పటిష్టమేనా..?' అనే ప్రశ్నలు వస్తున్నాయి. ఏదేమైనా ఆలయ పవిత్రతకు భంగం వాటిల్లకుండా చూడడంతోపాటు భక్తుల విశ్వాసాలను దెబ్బతీయకుండా చూడాలనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. అయితే ఈ హుండీ నగదు అపహరణపై చర్చించాల్సింది పోయి.. ఈ విషయం ఎలా బయటికి వచ్చింది? 'నమస్తే తెలంగాణ'లో కథనం ఎలా వచ్చిందో తెలుసుకోవడంపై దృష్టి పెడుతున్నారనే విమర్శలు వస్తున్నాయి.

## మేమింతే!

### మారని మందుబాబులు

- ఏటా పెరుగుతున్న డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు
- జరిమానా కట్టినా.. జైలుకు వెళ్లినా మార్పు శూన్యమే
- మత్తులో వాహనాలు నడుపుతూ రోడ్లపై విన్యాసాలు
- తాగని వాహనదారులకు ఇబ్బందులు



**మందు తాగి రోడ్డెక్కితే పోలీసులు పట్టుకుంటారు. కేసులు నమోదు చేస్తారు. కోర్టుకు వెళ్లాలి. జరిమానా చెల్లించాలి. మోతాదుకు మించి వస్తే కటకటాల్లోకి తప్పదు. ఇవేమీ జరగక పోయినా మద్యం మత్తులో వాహనం నడిపి ప్రమాదానికి గురైతే కుటుంబం రోడ్డున పడుతుంది. ఇవన్నీ తెలిసినా మారేది లేదంటున్నారు మందుబాబులు! కౌనెల్సింగ్ ఇస్తున్నా.. శిక్ష పడుతున్నా.. కండ్ల మందే ఎన్నో ఘటనలు కనిపిస్తున్నా 'మేమింతే' అంటూ రోడ్డెక్కడమే తప్పా మారడం లేదు!**

కరీంనగర్ రాంనగర్, డిసెంబర్ 26 : మద్యం తాగి వాహనాలు నడుపుతూ పట్టుబడి శిక్ష పడ్డ వారి సంఖ్య గతేడాదితో పోలిస్తే నాలుగు రెట్లు పెరిగింది. మరోవైపు మద్యం తాగి రోడ్డెక్కి ప్రమాదాల బారిన పడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరుగుతూనే ఉన్నది. అయితే మద్యం తాగి పోలీసులకు పట్టుబడితే జరిమానా కడతారు. లేదంటే జైలుకు వెళ్తారు. ఈ రెండింటి వల్ల నష్టం లేదు. కానీ, ఒకవేళ ప్రమాదం బారిన పడితే కుటుంబాలు రోడ్డున పడుతున్నాయి. జీవితాలు ఆగమవుతున్నాయి. తాగిన మైకంలో తాగని వాహనదారులను ఇ బ్బందులు పెడుతున్నారు. ఈ ఒక్క ఏడాదిలోనే కరీంనగర్ జిల్లాలో మద్యం మత్తులో వాహనాలు నడిపి ప్రమాదాలకు కారణమై సుమారు 130 మంది మృత్యువాతపడ్డారు. కుటుంబ పెద్దను కోల్పోయినవారు కొందరైతే.. చేతికి అందివచ్చిన కొడుకులను పోగొట్టుకున్న వారు మరికొందరున్నారు. గత నెలలో రాత్రి మద్యం మత్తులో ముగ్గురు యువకులు నగరంలోని ఓ ప్రధాన రోడ్డులో ఆగి ఉన్న లారీని ఢీకొట్టి మృతిచెందారు. ఇలానే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఎంతో మంది తాగి వాహనాలు నడిపి, ప్రమాదాలకు కారణమవుతున్నారు. ప్రాణాలు కూడా కోల్పోతున్నారు. లేదంటే తీవ్రగాయాలతో మంచానికే పరిమితమవుతున్నారు. ఇలాంటి ఘటనలెన్నో కండ్ల ముందే కనిపిస్తున్నా మందుబాబుల ప్రవర్తన మారడం లేదు. కండ్ల ముందే జైలుకు వెళ్తున్నా.. ప్రమాదాల బారిన పడి వారి కుటుంబాలు రోడ్డున పడుతున్నా.. మార్పు మాత్రం రావడం లేదు. మద్యం తాగి వాహనం నడపకుండా ఉండేందుకు ఎన్నో అవకాశాలు ఉన్నా మనుషుల వైఖరిలో మార్పు రావడం లేదు.

**కరీంనగర్ జిల్లాలో**

ఒక్క కరీంనగర్ కమిషనరేట్ పరిధిలోనే 2023లో 2,776 కేసులు నమోదు కాగా, 56 మంది జైలు పాలయ్యారు. ₹39,48,500లు జరిమానా రూపంలో చెల్లించారు. 2024లో 2,861 కేసులు నమోదు కా గా, 226మంది కటకటాలు లెక్కపెట్టారు. ₹48,15,700 జరిమానా విధించారు.

## కూరగాయలు తెంపేందుకు వెళ్లి..

- విద్యుత్ షాక్‌తో మహిళ మృతి



రేణుక(ఫైల్)

ఎల్లారెడ్డిపేట, డిసెంబర్ 26: పెరట్లో కూరగాయలు తెంపేందుకు వెళ్లి ఓ మహిళ అనుకోని రీతిలో విద్యుత్ షాక్‌తో ప్రాణాలు కోల్పోయింది. ఎస్ఐ రమాకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్లారెడ్డిపేట మండలం గుండారం గ్రామానికి చెందిన సిద్దాల బాలయ్య తన ఇంటి పక్కన పెరట్లో కూరగాయలు పండిస్తున్నాడు. కోతుల నుంచి రక్షణ కోసం పెరటి చుట్టూ విద్యుత్ వైరును ఏర్పాటు చేశాడు. ఎప్పటిలాగే గురువారం ఉదయం కూరగాయలు తెంపేందుకు అతని భార్య రేణుక(40) పెరట్లోకి వెళ్లగా, విద్యుత్ తీగకు తాకి షాక్ కొట్టి కిందపడిపోయింది. స్థానికులు ఎల్లారెడ్డిపేటలోని దవాఖానకు తరలించగా, అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. బాలయ్య ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## స్నానానికి చన్నీళ్లే దిక్కు!

- కస్తూర్బాలో పని చేయని సోలార్ గీజర్లు
- చలికాలంలో బాలికలకు తప్పని కష్టాలు
- పట్టించుకోని జిల్లా అధికారులు

ముత్తారం, డిసెంబర్ 26 : ఎముకలు కొరికే చలిలోనూ విద్యార్థుల స్నానాలకు చన్నీళ్లే దిక్కవుతున్నాయి. ముత్తారం మండలంలోని కస్తూర్బాగాంధీ పాఠశాల బాలికల వసతిగృహంలో సోలార్ గీజర్లు పనిచేయకపోవడంతో ఇక్కట్లు ఎదురవుతున్నాయి. ఇక్కడ మొత్తం 274 విద్యార్థులు ఉండగా, గతంలో 8 సోలార్ గీజర్లను ఏర్పాటు చేశారు. వాటి సామర్థ్యం సుమారు 3 వేల లీటర్లు కాగా, ఇప్పుడు అవేవీ పనిచేయకపోవడంతో విద్యార్థులు చన్నీళ్లతోనే స్నానాలు కానిచ్చేస్తున్నారు. పేరెంట్స్ మీటింగ్‌లో తాము ఎన్నిసార్లు చెప్పినా అధికారులు పట్టించుకోవడం లేదని విద్యార్థుల తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఈ పాఠశాల చుట్టూ పంట పొలాలు, 500 మీటర్ల దూరంలో మానేరువాగు, ఊర చెరువు ఉండడంతో చలికి మరింత ఇబ్బందిగా ఉందని, పిల్లలు ఉదయం చేయాల్సిన స్నానాలు సాయంత్రం, రాత్రి చేస్తున్నారని తెలిపారు. కొన్ని రోజుల క్రితం కొందరు విద్యార్థులు అస్వస్థతకు గురైనప్పుడు కొందరికి అస్తమా లక్షణాలు ఉండడంతో రికవరీకి ఇబ్బంది అవుతుందని వైద్యులు తెలిపారని, మరీ ఇలా చన్నీటి స్నానం చేస్తే ఇబ్బందులు జరుగవా..? అని ప్రశ్నించారు. ఈ విషయమై జీసీడీవో కవిత మాట్లాడారు. సోలార్ గీజర్లు పనిచేయకపోవడం వాస్తవమేనని, ఈ సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లామని చెప్పారు. వాటిని రిపేరు చేసే పరిస్థితి లేకపోవడంతో కొత్తవి బిగించాలని, వాటి విలువ సుమారు రూ.6 లక్షలు ఉంటుందన్నారు. ఈ సమస్యను పది రోజుల్లో పరిష్కరిస్తామని స్పష్టం చేశారు.



కస్తూర్బాలో నిరుపయోగంగా ఉన్న సోలార్ గీజర్లు

### ఎవరూ పట్టించుకుంటలేరు



నా కూతురుని కస్తూర్బా పాఠశాలలో రెండేళ్లుగా చదివిస్తున్న. అప్పటి నుంచి పాఠశాలలో వేడి నీళ్లతో స్నానం చేయలేదు. రోజూ చన్నీటితో చేస్తున్నరు. సెలవు రోజుల్లో ఇంటికి వచ్చినప్పుడే వేడినీళ్ల స్నానం చేస్తుంది. పేరెంట్స్ మీటింగ్‌లో ఈ సమస్యలపై అధికారులకు చెప్పిన. అయినా ఎవరూ పట్టించుకుంట లేరు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మా పిల్లల బాధను తీర్చాలి.

- మండల గట్టయ్య, విద్యార్థిని తండ్రి




